వేమకోటి సీతారామ శాస్త్రి

# దర్పణం




పెద్దమ్మాగోరూ బండికెచ్చాను. మనం కొంచెం పెందిల బయల్దేరితే రామి నాయుడు యింటికాడుండొచ్చు జాల మైతే ఆడు కలవడు" అన్న సోమేసు కేక శిథిలమయిన ఆ మేడ ముందు హాలులో ప్రతిధ్వనించింది. పగిలిన గోడ సందుల్లో పాకు పేరుకుని వుంది.

స్టెయిన్‌లెస్ స్టీలు గ్లాసుతో కాఫీ తాగుతున్న సీతమ్మగారి గుండె కరాలు మంది. దగా చేసిన మనుషులముందు మాట్లాడటానికి మనసు పుట్టదు. కానీ తప్పదు.

"ఇంక చాలమ్మా. యిప్పటికే చాలా ఆలస్యమయింది. అన్నట్టు నా లలిత. నా చిట్టితల్లి, నా ముద్దుల మనవరాలేం చేస్తున్నాది" అంటూనే గుమ్మంలోకి అడుగుపెట్టబోయింది.

"ఒద్దమ్మా! నువ్వు దాన్ని పలకరిస్తే

నీ కాళ్ళ కడ్డంపడి వస్తానని మారాం చేస్తుంది..." అంది కమల అను నయంగా.

"అదీ నిజమే. వస్తాను. వద సోమేసూ" అంది బండెక్కుతూ.

బండి నాటుతోవ దాటి రోడ్డెక్కింది. బండి చీమకన్నా నిదానంగా నడుస్తున్నది. బండిలో కొంచెం గడ్డిమీద వేసిన చిరుగుల తుంగచాప బండి గతుకుల్లోపడినప్పుడల్లా జారిపోవడానికి ప్రయత్నిస్తున్నది. కదుల్తున్న బండితో పాటు సీతమ్మగారి జ్ఞాపకాలు కదుల్తున్నాయి.

అప్పుడు పట్టుపరుపుల్తో మెత్తని బాలీసులతో బండి పరుగెత్తేది. బండిని రెండు అందమయిన మైసూరెడ్లు లాగేవి. అవి పరిగిడుతుంటే వాటి గంటలు, మువ్వలు లయబద్ధమైన సంగీతాన్ని వినిపించేవి. అప్పుడు సోమేసుకి చెవికి కమ్మి, ముక్కుకి కమ్మి వుండేవి. సోమేసు పాడే తప్పెటగుళ్ళ 'జోలాలి.. ఒకటాయె రెండాయె ఉయ్యాలా...' పాటలో సంగతులు. ప్రశాన్యత తనను తన భర్తను కొత్తలోకాలలో విహరింపజేసేవి.

సీతమ్మగారికి ఒళ్ళు జలదరించింది. చిరుగులు కనిపించకుండా కట్టుకున్న గత వైభవానికి ప్రతీకగా నిలిచిన పాత క్షీరాబ్ధి బరంపురం పట్టుచీరలో ఒక ఎండిపోయిన గడ్డిపూచలా వుందామె.

కంటిముందు ఊరు సత్యవరం కనుమరుగవుతోంది, బండి తారురోడ్డు ఎక్కింది.

సీతమ్మగారు దీర్ఘంగా నిట్టూర్చింది, ఆమె చేయి కొంగుకు కట్టిన యిచ్చు రూపాయలకు తగిలింది.

నరసన్నపేట మామిడితోటలు దాటి బండి తిలారుఅడ్డరోడ్డుమీదకు ప్రయాణం ప్రారంభించింది. ప్రకృతి కనుచూపుమేరా బంగారం ఆరబోసినట్లుగా వుంది.

"సోమేసూ ఎడ్లను ఎండగట్టేశావేమిటోయ్. డొక్కలు కనిపిస్తున్నాయి..." అంది సీతమ్మగారు జాలిగా.

సోమేసు నవ్వాడు.

"మీకు తెల్దా అమ్మగారూ. మనుషుల డొక్కలే ఎండిపోతున్నాయి. బయటికి కనిపిస్తున్నాయి. ఏనాటి ఋణానుబంధమో వాటికీ నాకూ..." అన్న అర్థం ఆ ఎండిపోయిన నవ్వులో ప్రతిబింబించింది.

ఏరబాడు కనుచూపుమేరలో వుంది. రోడ్డుపక్కన అరటితోటలు. చిన్నచిన్న కూరాకుల మళ్ళు. వాటి మధ్యలో ఏతాం బావులు కిర్రుకిర్రుమంటూ గాలితో స్నేహంచేస్తూ సంగీతం పాడుతున్నాయి.

సీతమ్మగారు తన పట్టుచీర జరీ బోర్డరు చూస్తోంది. ఒకప్పుడు అది చాలా అందంగా వుండేది. మెరిసేది. యిప్పుడేమో పాలిపోతోంది తన జీవితం లాగే.

అవును. తమ ఐదొందల యః రాల

యినాందారీ పొలం తన భర్తదాతృత్వం,
మనిషిమీద అపారమైన నమ్మకం
యివన్నీ జీవితాన్ని భగ్నం చేశాయి.
రైతులు అగ్రహారం భూములు స్వాధీనం
చేసుకున్న రోజున... "మీరేం భయపడ
కండి బాబుగారూ! ఒక్క దావా పడే
యండి" అని సలహా యిస్తూ కరణం
తన జేబులో పెన్ను తీశాడు. భర్త
పట్నం బయల్దేరే రోజునే దత్తపుత్రుడి
తండ్రి వచ్చాడు.

"అన్నగారూ! అనాడు 'అపుత్రస్య
గతిర్నాస్తి' అంటూ బాధపడుతున్నారని
విని నా కొడుకుని మీకు దత్తత
యిచ్చాను. కానీ గతిలేక కాదు. వాడ్ని
డబ్బు మీదైనా నా దగ్గరే వుంచి చది
విస్తున్నాను. మిగిలిన లొడ్డూలొసుగూ
మీరు కోర్టులకు దావాలకు ఖర్చుపెట్టేస్తే
వాడి గతేం కాను" అన్నాడు కోదండం.

తన భర్తకు కోపం వచ్చింది. తను
అసలు దత్తత వద్దంది. మన కింకా
వయస్సు దాటలేదు. ఎందుకా తొందర
అని చాలా విధాలుగా చెప్పింది. కానీ
భర్త వినలేదు.

"ఈ దేవిడీలో మా తండ్రితాతల
దగ్గర్నుంచీ చాలా యజ్ఞాలు, యాగాలు
జరిగాయి. అన్నదానం విషయం నేను
చెప్పనక్కర్లేదు. ఏ పుణ్యమూ మనల్ని
కరుణించలేదు. ఈ బిడ్డడ్ని పెంచుకున్న
వేళావిశేషం మనకి పిల్లలు కలగొచ్చు"
అని చెప్పేసరికి తను ఒప్పుకోక తప్ప
లేదు. కానీ దత్తపుత్రుడు సూర్యంకూడా
తన దగ్గర పెరగలేదు. వరసకు చుట్ట
మైనా కోదండం కటిక దరిద్రుడు. పిల్లడ్ని
చదివించాలన్న సాకుతో నమస్తం దేవిడీ
నుండి తీసుకెళ్ళేవాడు. రామ్మూర్తిగారు
వాళ్ళ పేదరికాన్ని గ్రహించి వాళ్ళ
కుటుంబాన్ని అనేక రకాలుగా ఆదుకునే
వారు. కొన్ని సంవత్సరాల తర్వాత
తనకు ఆడపిల్ల పుట్టింది. దేవిడీలో లక్ష్మీ
దేవి పుట్టిందన్నారు. ఊరంతా పెద్ద
పండుగచేశారు. ఆ వేడుక మరి చెప్పలేం.
తనకూ. తన భర్తకూ ఆడుగులకు
మడుగులొత్తే కోదండం పరిస్థితులు
మారినంతలో ఎదురునిలిచి మాట్లాడాడు.

"నా కొడుక్కి నేను అన్యాయం చేసు
కుంటానయ్యా" అంటూనే బ్యాంకులో
డిపాజిట్లూ అవీ కొడుకుపేర్న వేసేశారు
తను పల్లెత్తు మాట అనలేదు.

"సీతా! మనకేం వుంచుకోకుండా
అంతా వాడిపేర వేసేశాను. పుట్టి బుద్ధె
రిగి మనం ఎవ్వరికీ అన్యాయం చెయ్య
లేదు. కోదండం పెరిగిన సంస్కారం
అది. ఒక్కగానొక్క కూతురు దానికేం
లోటు చేయను. కోర్టులో గెలిస్తే ఈ ఆస్థి
అంతా దానిదే..." అంటూ తనని బుజ్జ
గించారు ఒకనాటి రాత్రి. ఏనాడూ తను
భర్త మాట కెదురాడలేదు. అమృత
హృదయు డాయన.

ఆస్థి హైకోర్టులో వుండగానే తనులకు
పెళ్ళి సంబంధం వచ్చింది. కుర్రవాడు

చదువుకున్నవాడు. ఆస్థి గలవాడు. బుద్ధిమంతుడు. ఇంకేం ఆలోచించలేదు భర్త. హెచ్చు వడ్డీకి అప్పుచేసి చాలా గొప్పగా పెళ్ళిచేసి పంపించాడు. కానీ ఏం జరిగింది? ఒక్కొక్క జీవితం చిత్రంగా, అమూహ్యంగా ఎన్ని మలుపులు తిరుగుతుందో ఎవరికి తెలుసు.

ఆలోచనలు తెగిపోయాయి. బండాగిపోయింది. ఎదురుగా పెద్ద లారీ బరువుతో వస్తోంది. లారీ దాటిన తర్వాత బండి కదిలింది, సీతమ్మగారి ఆలోచనలతో పాటు.

"కోర్టు కెళ్ళినవాడు కాటి కెళ్ళినవాడు ఒక్కటే."

వ్యసనాలకు లోనై కూతుర్ని హింస పెట్టిన అల్లుడు.

భూములన్నీ రైతులకే చెందాలని యిచ్చిన కోర్టువారి జడ్జిమెంటు-యివన్నీ ఆయన జీవితం సరిహద్దుల కవతలకు తరిమేశాయి.

ఆ సమయానికి వచ్చి ముళ్ళమీద కూర్చున్నట్లుగా కూర్చుని దత్తత తండ్రిని పున్నామ నరకం నుండి తప్పించటానికి కర్మ చేశాడు కొడుకు. ఆ మధ్యకాలంలో వాళ్ళు అభివృద్ధి చెందారు. రెండు మిల్లులు పెట్టారు. ఒక సినిమా హాలు కట్టించారు. అదంతా రామ్మూర్తిగారి డబ్బే. బంధువులందరి ముందూ కారెక్కబోతూ...

"ఒదినగారూ! యింత యిల్లూ. యివీ విడిచి అక్కడికి ఎలా రాగలరు? వచ్చినా ఏం మనశ్శాంతి లభిస్తుంది. ఉన్న వూరు కన్న తల్లీ అన్నారు. అబ్బాయి ప్రతీ ఆదివారం వస్తూంటాడు..."

తనకి దుఃఖం వచ్చేసింది. కళ్ళనీళ్ళు పెట్టుకుంది.


"అలా అధైర్యపడకండి. పెద్దవారు. అమ్మాయి మరీ బెంబేలుపడిపోతుంది ..." యింక మరి మాటలు మాట్లాడటానికి ఏం లేవన్నట్లు కారెక్కాడు కోదండం.

అంతే! మరి ఆ తర్వాత దత్త పుత్రుడు రాలేదు.

కొంతకాలం తర్వాత హాలులో వుండే రెండు నిలువుటద్దాలలోనూ ఒకటి వుంచుకుని ఒకటి పంపించమని కోదండం ఉత్తరం వ్రాశాడు. కానీ తను జవాబు రాయలేదు.

వ్యసనపరుడైన అల్లుడు అమ్మాయి కమలను అస్తమానం పంపించేసి అ వున్నది కాస్తా హరింపజేశాడు.

"ఏం చేస్తానమ్మా! ఆయన పరమ మూర్ఖంగా తయారయ్యేరు. ఎంత చిత్రహింస పెడుతున్నారో నీకు తెలియదు. నన్ను కన్న నేరానికి నీ మనసుని రంపపుకోత కోస్తున్నానమ్మా! చచ్చిపోదామనుకున్నాను. కానీ...కానీ...ఈ పిల్లలు నా ప్రాణానికి గుదిబండలయి కూర్చున్నారు..." అంటూ వలవల ఏడ్చేసింది.




ఎవరు వూరడిస్తారా బాధాతప్త హృదయాల్ని.

"ఆలా గనకు తల్లీ! నా కుండే ఆశా దీపానివి నువ్వే తల్లీ! మనిషికి బ్రతుకు ఒక వరం అమ్మా. నువ్వు చచ్చిపోయి నాకు చీకటి మిగల్చకమ్మా." అంటూనే కూతురి సంసారం నిలపడంకోసం చివరికు గతకాలపు వైభవాన్ని మిగిల్చిన మేడను కూడా తనఖా పెట్టేసింది.

ఏరబాడు దగ్గరవుతోంది. బండి వూరి మలుపు తిరగకుండానే ఆగింది. కళ్ళం ముందూ, కళ్ళంలో బంగారం కుప్పలు పోసినట్లుగా వరికుప్పలు. బల్లమీద కూర్చుని చుట్టకాలుస్తూ పాలేళ్ళకు పనులు పురమాయిస్తున్నాడు దాసు

సీతమ్మగారు బండి దిగి దాసు దగ్గరకి వచ్చారు.

"దండాలు బగతమ్మగోరూ" అన్నాడు చుట్ట బల్లమీద పెడుతూ. వాడు రామినాయుడి దగ్గర పాలేరు. తనకున్న భూమి సాగుచేస్తున్నవాడు రామినాయుడు.

సీతమ్మగారు ఎందుకు వచ్చిందో తనకు తెలుసు. "రామినాయుడు లేరమ్మా అయి దాబాదు ఎల్లినాడు," అన్నాడు.

బండి మలుపు తిరిగింది వూర్లోకి. వూళ్ళోవున్న ఒక పెద్ద మేడముందు ఆగింది బండి.

బండి ఎవరిదని ఊర్లోవాళ్ళు కొత్తగా చూడటంలేదు. వాళ్ళకి తెలుసు అది బగతమ్మగోరిదని

చాలాకాలం క్రిందటయితే, బండి వెళుతుంటే వినయంగా అందరూ దండాలు పెట్టేవారు

"నెమ్మదిగా దిగండమ్మా!" అని

లోపల్నుండి స్టూలుబల్ల తెచ్చి వేశాడు సోమేసు.

ఆ రోజుల్లో అయితే రామినాయుడి పెళ్ళాం సూరమ్మ చెంబుతో నీళ్ళు తెచ్చి కాళ్ళు కడిగేది. రామినాయుడు పరుపులు, బాలీసులు తెచ్చి వేసేవాడు. పెద్ద విసనకర్రలతో యిద్దరూ చెరో వైపు విసిరేవారు.

తెలుగు సినిమాకు వేసిన సెట్టులా వుందా మేడలోని గది. సోఫాసెట్లు వున్నా అన్నీ ధూళిపట్టి వున్నాయి. స్టూలుమీదనే కూర్చుంది సోమేసు లోపల కెళ్ళాడు, నాయురాలు సూరమ్మను పిలుచుకు రావడానికి.

“మల్లా ఎందుకు తెచ్చినావురా ఈ ముసల్దాన్ని నా పేనాలమీదికి” అంటూ శయ్యాగృహం నుండి అప్పలమ్మలా లేచి వచ్చింది. మెడ తిరగని బంగారం కంఠాన్ని చుట్టలుచుట్టలుగా చుట్టుకొని వుంది. పనీపాటా లేని ఆమె శరీరం వికృతంగా లావెక్కిపోయింది.

“ఏటమ్మా! మల్లా యిలా వచ్చినావు?” విసురుగానే అడిగింది.

“అర్జంటుగా డబ్బు కావాలమ్మా!” అంది సీతమ్మ.

“సెప్పినాం కదా? వుప్పుడివ్వలేం. మా యజమాని ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం అయిదరాబాదు ఎల్లినాడు. యింకెంత కరుసుంటదో ఏటో ...” అంది. సూరమ్మ కప్పుడే తన భర్త ఎమ్మెల్యే అయిపోయి మంత్రి అయిపోయినట్లుగా కలలు కంటోంది. సీతమ్మగారి గుండెల్లో రాయిపడింది. ఉన్న కాస్త పొలంలో ధాన్యం మూడు సంవత్సరాలుగా యిస్తానని వాయిదా వేస్తున్నాడు. తర్వాత డబ్బుయిస్తామన్నాడు. అమ్మదామంటే ఆ వూర్లో ఎవ్వరూ కొనరు

“అలాగనకు సూరమ్మా! నా మనవడికి డబ్బు డిపాజిట్ కడితే వుద్యోగం వస్తుంది. వాళ్ళ ఛిన్నాభిన్నమైన బ్రతుకు బాగుపడుతుంది. మా అల్లుడి సంగతి నీకు తెలుసు టైము దగ్గరపడిపోయింది. నువ్వు కొంచెం పెద్దమనసు చేసుకుని..” అర్ధోక్తిలోనే ఆగిపోవాల్సి వచ్చింది సీతమ్మగారు.

“చెప్పాను కదమ్మా! ముందచేదు సర్దుతాడు” అంది విసుగ్గా. ఆ విసుగులో నువ్వింక వెళ్ళవచ్చు అన్న సూచన వుంది.

సీతమ్మగారి కళ్ళలో నీళ్ళతెర! నోట మాటరాలేదు. గొంతుక తడారిపోయింది. వెయ్యి ఆశల రెక్కలు ఒక్కసారే తెగిపోయాయి. శ్రోత సోమేసు ముఖం కోపంతో జేవురించింది.

“నాయిరాలా! నువ్వలాగనకు. నువ్వు ఆడకూతురివే. అంత కాకపోయినా కనీసం వెయ్యి రూపాయలయినా సరుదు...ఎలాగయినా ఉద్యోగం...” ఆగాడు.

“ఆయమ్మ అయింది. నువ్వింక రికమెండేషను సేస్తున్నావా?” అని కసిరింది,

సూరమ్మ అనే నాయురాలు. రామినాయుడికి నడమంత్రపు సిరి తగిలి, రాజకీయాల్లోపడితే నాయిరాలే చక్రం తిప్పుతున్నది. సోమేసుకా విషయం తెలుసు. సూరమ్మ మరేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

అహంకారం, స్వార్థం, ధనమదాంధత, అవిశ్వాసం, కొండ చిలువల్లా కబళించుకున్న చీకటి జీవితాల్లో ఎవరు వెలిగిస్తారు న్యాయం ధర్మం అనే దీపాల్ని. కరుణ, దయ, జాలి అనే అమృత బిందువులు ఎవరు చిందించగలరు. సోమేసు కోపం పెదవి దాటలేకపోయింది.

బండి తిరుగుముఖం పట్టింది. రోడ్డుకిరువైపులా బంగారం పండే భూములు. మధ్యన పంట కాలువ. యినాంవారీ చట్టంలో అన్నీ రామినాయుడి వశమయ్యాయి. రెండెకరాల పొలం మిగిలింది. అవన్నీ కదుల్తున్న బండితోపాటు అదృశ్యమవుతున్నాయి. సీతమ్మగారి గుండె కొట్టుకుంటోంది ఆవేదనతో.

"అల్పుడ్ని బలుడు కొడితే బలుడ్ని బెమ్మదేవుడు కొడతాడని వూరికే చెప్పారమ్మా పెద్దలు! మీ కన్నాయం సేసినోడు బాగుపడడు మరి అది సరే అమ్మగోరూ! మీ రిప్పుడేటి సేస్తారు. అబ్బాయిగారి కుత్తరం రాయండి. పట్నంలో సాలా పెద్దపెద్ద యాపారాలున్నాయిగదా ఆయనగోరికి ..." సలహాలాంటి సూచన చేశాడు.

"ఆదీ అయింది సోమేసూ! తనిప్పుడు బాధల్లో వున్నానని, ఏం చేయలేనని, చేస్తున్న సాయమల్లా ఆ భూమిలో పండే ధాన్యంవాటా అడగకుండా వుండటమే అని ఉత్తరం రాశాడు" అంది విచారంగా.

"మరిప్పుడేటి సేస్తారమ్మగోరూ! అమ్మాయిగోరు డబ్బుకోసమే వచ్చినారు కాబోలు!" అడిగాడు ఎడ్లను అదిలిస్తూ. వాడి గుండె విలవిలలాడుతోంది. వాడి బ్రతుకూ అంతంత మాత్రమే. రెక్కాడితేగాని డొక్కాడదు

సీతమ్మగారు సమాధానం యివ్వలేదు

శేషజీవితం దత్తత కొడుకు దగ్గర సవ్యంగా వెళ్ళాలని ఆశించింది. కోదండం కొడుకు పెళ్ళికి పిలవలేదు, పెళ్ళయిన తర్వాత ఒక్కసారి కోడల్ని లాంఛనప్రాయంగా చూపించి కారెక్కించి తన దగ్గరకు వచ్చాడు కొడుకు

"బెడ్‌రూంలో మంచి నిలువుటద్దాలు లేవు. నా భార్య అద్దాలు చూసిన దగ్గర్నుంది అత్తగార్ని అడిగి తీసుకోండి అని అడుగుతోంది. తీసికెళ్ళనా..." అడిగాడు తళతళలాడుతున్న రెండు నిలువుటద్దాల్ని చూసి. దాని ఖరీదు ఒక్కొక్కటి సుమారు వెయ్యి రూపాయలు పైగా వుంటుంది

"బాబూ! ఇవి మీ నాన్నగారు మిగిల్చిపోయిన తరతరాల జ్ఞాపకచిహ్నాలు. నా తరువాతనే నీకూ, అమ్మాయికీ చెందుతాయి." అంది తను.

వాడు కోపంతో విసవిస నడిచి కారెక్కి వెళ్ళిపోయాడు.

"ఏటమ్మగోరూ! మాట్లాడరు!" అడిగాడు పరధ్యానంగా వున్న సీతమ్మను. ఆమె ఉలిక్కిపడింది.

ఆ దృశ్యం తెగిపోయింది.

"ఇంకేం చేయగల్ను సోమేసూ ఆ దేవుడే దిక్కు" అంది.

బండి నాటురోడ్డెక్కింది. ఊరిలోని శివాలయం గోపురం కనిపిస్తోంది.

"దేవుడు...న్యాయం...ధర్మం..." నవ్వుకున్నాడు సోమేసు.

"అమ్మగోరూ! మీరేం అధైర్య పడకండి. రేపు నేడువలస సంతలో పశువుల్ని అమ్మేస్తాను. పదిహేను వందలొస్తాయి. అవి అమ్మాయిగోరి కిచ్చేయండి..." అన్నాడు.

"సోమేసూ! నా కుటుంబంకోసం నీ నోటిముందు కూడు తీసేసుకుంటావా" సీతమ్మగారు అవాక్కయిపోయింది.

"అవునమ్మగోరూ! ఈ శరీరం మీ వుప్పుతిని పెరిగింది. మీ కష్టసుఖాలకు కాకపోతే మరెందుకు నా పేనం. పట్నంలో నా కొడుకు దగ్గరికెల్లి పోతాం నేను, నా పెల్లాం... లేకపోతే నేను ముసలాడ్నయినా కండబలం, సూపు తగ్గలేదమ్మగోరూ. కూలో, నాలో చేసుకునో సింగుపురంలో రాళ్ళు కొట్టుకొనో బతుకుతాను ... మరేటి ఆలోసించకండి..." అన్నాడు.

"సోమేసూ! యింత త్యాగం నేను భరించలేను. నాతో చెప్పకుండా అలాంటి పని చేయకు. నా మీద ఒట్టే .." అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

మరేం మాట్లాడలేకపోయాడు.

బండి శిథిలసౌధం ముందాగింది. గడపలో కమల మాసికల చీర భుజం నిండుగా కప్పుకుని,

"జాగ్రత్తగా దిగండమ్మా!" ఆమె కంఠంలో ఆవేదన.

"సోమేసూ! నీకు బండి అద్దె చాలా యివ్వాలి. అందాక ఈ రూపాయుంచు" అంటూ కొంగునున్న యిచ్చురూపాయి తీసి యిచ్చింది.

"ఉంచండమ్మా తర్వాత యిద్దురుగాని" అని మృదువుగా తిరస్కరించి బండి మొఖరు వెనక్కు విప్పేశాడు. ఆ వూరంతా ఒకటే వీధి. వీధంతా ఫర్లాంగు పొడవుంటుంది. ఎవరింటికి ఎవరొచ్చినా అందరికీ తెలుస్తుంది. ఆ గ్రామంలో ఆ కుటుంబ వైభవాన్ని చాలామంది చూశారు. ఎన్నో సహాయాలు పొందారు వారిమీద గౌరవం సానుభూతి రెండూ వున్నాయి. కాని ఏం చేయగలరు? వారి జీవితాలు అంతంత మాత్రమే.

బండి ఊరు మలుపు తిరిగింది.

"అమ్మా! నువ్వు భోంచేశావా?" అడిగింది సీతమ్మ లోపలికి వస్తూ. ఆకలికి శోష వచ్చినట్లయింది ఆమెకు.

"లేదమ్మా! నీ కోసం ఆగాను..."

అంటూనే కంచాలు తీసి పీట వేసింది. మొఖం కడుక్కున్నాక గాని సీతమ్మ గారు తెప్పరిల్లలేదు. ఆ ఎండలో జామి చెట్టు ఆకులమధ్య రెండు చిలకలు సేద దీర్చుకుంటూ సరాగాలాడుకుంటున్నాయి

"దేవుడా! మానవులుగా పుట్టించకుండా పశువులుగానైనా, పక్షులుగానైనా పుట్టించినా బాగుండేది కదా" అనుకుంది సీతమ్మగారు, పెరట్లో కాళ్ళు కడుక్కుంటూ ఆ దృశ్యాన్ని చూసి.

కంచంలో పోసిన జావ చూసి ఆశ్చర్యపోయి కూతురివేపు చూసింది. ఆమె కళ్ళలో గోదావరి వరదలా కన్నీరు.

"షావుకారు యిప్పటికే చాలా డబ్బివ్వాలి, ఎలా తీరుస్తారో మీ అమ్మ అంటూ యివ్వలేదమ్మా! అప్పుడు సోమేసు భార్యకు కబురు పంపిస్తే..." మరి చెప్పలేకపోయింది కమల. పెదాలు వణికాయి.

"అమ్మా! కాలం ఎంత విపరీతమయినదో చూశావా" సీతమ్మగారి కళ్ళు మాటల్తోనే చెమ్మగిల్లాయి.

హాలులో నుక్క మంచంమీద కూర్చున్న సీతమ్మగారికి ప్రయాణ బడలికవల్ల కళ్ళు మూతలుపడుతున్న సమయంలో.

"అమ్మా! నీ మనవడు ఉత్తరం రాశాడమ్మా" అంది కమల. ఉలిక్కిపడింది సీతమ్మగారు. నిద్రాదేవి భయపడి పారిపోయింది.

"నీవు పడుతున్న శ్రమంతా చూస్తున్నానమ్మా! నిన్ను ఇలా బాధపెట్టటంకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకునయినా; యింత విషమైనా మింగి ఛస్తే..." సీతమ్మగారు దిగ్గున లేచి కూతురు నోరుమూపింది. గుండెకు దగ్గరగా హత్తుకుంది.

"ఈసారి అలా అంటే నన్ను చంపుకు తిన్నంత ఒట్టే. ఏం రాశాడో చదువమ్మా!" అంది కూతుర్ని మంచంమీద కూర్చోమని సౌంజ్ఞచేస్తూ.

"మ.ల.సౌ. అమ్మకు.

నీవు వెళ్ళి యింకా రాలేదని నాన్న నిన్ను నానాతిట్లు తిడుతున్నారు. ఉద్యోగానికి గడువు రెండురోజులే వుంది. అనుకున్న సమయానికి పదిహేను వందలూ యివ్వకపోతే ఉద్యోగం కేన్సిలవుతుందని చెప్పారు. నాన్న విని 'పోతేపోనీ యింకో ఉద్యోగం చూసుకోవచ్చు. ఈ లోగా ఆ డబ్బుతో వ్యాపారం చేసి లాభాలు సంపాదించి, మరో పెద్ద ఉద్యోగం సంపాదిస్తాం' అన్నారు. అప్పటికే నాన్నగారు బాగా తాగి వున్నారు.

"అమ్మా నువ్వు, అమ్మమ్మ నా ఉద్యోగంకోసం ఎన్ని యాతనలు పడుతున్నారో తలుచుకుంటే భయం వేస్తున్నది. అమ్మమ్మని యిబ్బంది పెట్టవద్దు. నాకు ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు కూలో నాలో చేసుకుని మిమ్మల్ని పోషిస్తాను. కానీ నాన్నగారు ఎంత ఆలస్యం

అయినా డబ్బు తీసుకోనే రమ్మన్నారు, యింటి...” మరి చదవలేకపోయింది కమల.

“నా తండ్రికి నా మీద ఎంత అభిమానం” సీతమ్మగారు పొంగిపోయింది.

“యింక రెండు రోజులే గడువుందమ్మా. లేకపోతే ఉద్యోగం కేన్సిలవుతుంది. ఆ తర్వాత డబ్బు ఆయన...” ఆగింది కమల.

“ఏముందమ్మా పేకాటాడి తాగి తందనాలాడ్తాడు. కొత్త విషయమేం కాదు కదమ్మా...” అంది సీతమ్మగారు దీర్ఘంగా నిట్టూర్చి.

ఉయ్యాల్లో పిల్ల ఏడవటంతో కమల లోపలి కెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలయినా సూర్యుడు ఉదయించలేదు. ఆకాశంలో నల్లమేఘాలు పోటీపడి ఆక్రమించుకుంటున్నాయి, దరిద్రుల్ని ఆకలి కబళించుకున్నట్లుగా. చిన్న జల్లుకూడా ప్రారంభమయింది. వూచలు వంగి తుప్పపట్టిన కిటికీలోంచి గాలి శరీరాన్ని బాధపెడుతోంది. జ్వరంతో మూలుగుతున్నాది సీతమ్మగారు. గోడకున్న పెద్ద అద్దాలు ఆమెను జాలిగా చూస్తున్నాయి. కళ్ళు తెరిచి చూసింది. అద్దాల్లో ఆమె ప్రతిబింబాలు విధికి, వంచనకు బలైపోయిన నిస్సహాయురాలి తెల్లవారుజాము జీవితానికి ప్రతిబింబాలు. అవి చెదరిపోయాయి ఆ అద్దంలో.

నవ వధువుగా చీని చీనాంబరాలతో, ఏడు వారాల నగలతో, ఆ మేడలో అడుగుపెట్టిన రోజున ఆమె ప్రతిబింబం, జమీందారీ హోదాలో భర్త సుందర రూపం. భర్త తమకంతో కౌగిలిలోకి తీసుకున్న క్షణాలు. అక్కడ చేసిన దానధర్మాలు. హోమాలు, క్రతువులు ఒక కేమిటి ఉచ్ఛదశను అనుభవించిన జీవిత దృశ్యాలు తిరిగిపోతున్నాయి. ఒక్కసారి ఆ దర్పణాలలో సినిమారీలులా తిరిగిపోయాయి. అవి చూసుకునే దుర్భర దారిద్రంతో బ్రతుకు కొనసాగిస్తున్న తృప్తి అనుభవిస్తోంది. పుణ్యకార్యాలను గుర్తు చేనుకుంటోంది.

ఆ అద్దాలు తన పంచప్రాణాలు. వరసన్న పేటనుండి షావుకారు సుబ్బయ్య ఒక్కొక్క అద్దానికీ వెయ్యి రూపాయలిస్తానని సోమేసు ద్వారా కబురు పంపించాడు. ఒకప్పుడు తమ యింటికి వచ్చి పట్టుబట్టలు అమ్మేవాడు. సోమేసు చెప్పలేక చెప్పాడు. అద్దాలు అమ్మనని కబురంపిన సన్నివేశం అంత జ్వరంలోనూ గుర్తుకువచ్చింది.

“అమ్మా! ఈ మాత్ర వేసుకుని బార్లీ తాగమ్మా” అంది కమల. వూళ్ళో వైద్యం చేస్తున్న స్కూలు టీచరు తల్లిని చూసి మాత్రలు పంపించాడు.

“అంత తాగలేనమ్మా, కొంచెం

మావారేటండీ 'ఉత్త మతిమరపు మనిషి!
మొన్న ఆ హెల్మెట్ లేకుండా వెళ్ళార్ట్! ఫైన్
వేశారు అప్పట్నించి.



తీసెయ్" అంది. గ్లాసు తీసుకొని త్రాగింది. ఆమెకు కొంచెం శక్తి వచ్చింది. శరీరం చెమటలుపట్టాయి.

"రేపే కదమ్మా ఆఖరి రోజు..." అంది నీరసంగా.

"యిప్పుడవేం పెట్టుకోకమ్మా. ముందు నీ ఆరోగ్యం బాగుపడనీ... తర్వాత ఆలోచిద్దాం..." అంది కమల

ఎదురుగా సోమేసు కంచుచెంబులో పాలు తీసుకుని నిలబడ్డాడు.

"సోమేసూ! బండీ తేవయ్యా!" అంది అంత నీరసంలోనూ.

"ఎందుకమ్మా..." అని వారించింది కమల, కానీ సీతమ్మగారి సైగతో సోమేసు వెళ్ళక తప్పలేదు.

"అమ్మా బట్టలు సర్దుకో!" అన్న మాటతోగాని కమలకు అర్థంకాలేదు తల్లి ఉద్దేశ్యం.

మూడు నిమిషాల్లో సోమేసు బండి వచ్చింది. వాడు గుమ్మంలో చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"సోమేసూ! ఈ గదిలో వున్న రెండద్దాలు తీసెయ్" అంది సీతమ్మగారు. తల్లి ఉద్దేశ్యం అర్థంమయింది కమలకు!

"అమ్మా... ఒద్దమ్మా... అవి తీయకమ్మా... అవి అమ్మొద్దమ్మా!.." అంది కమల దగ్గుత్తికతో. కమలకి తెలుసు ఆ అద్దాలతో తల్లికున్న అనుబంధం అద్దాలు బండిలో జాగ్రత్తగా పెట్టాడు సోమేసు. ఊరల్లా ఎవరి గుమ్మాల్లో వారు విలబడి చూస్తున్నారు.

"సోమేసూ! పేటలో సుబ్బయ్యా ఒకనాడు వెయ్యి రూపాయల కడిగాడు. అప్పట్లోనే వెయ్యి రూపాయలు ఖరీదు

చేసే బెల్లియం అద్దాలివి. రెండు వేలిమ్మను. ఆఖరి బేరం పదిహేను వందలయినా. మనవడి ఉద్యోగం విషయం చెప్పు. ఒప్పుకుంటాడులే..." అంది.

చక్కిలం జంగిడితో వచ్చిన సుబ్బయ్యకు పట్టుబట్టల వ్యాపారానికి తన భర్త డబ్బిస్తేనే యివాళ అభివృద్ధిలోకి వచ్చినవాడు. అదే సీతమ్మగారి నమ్మకం అతని మీద.

చిన్న జల్లు ప్రారంభమయింది. ఆమె గుండెల్లో నొప్పితో పాటు.

"అలాగేనమ్మా... కానీ పైన మేఘం వుంది. ఈ జల్లాగదేమో, పెద్ద వరసం పడుతుందమ్మగారు..."

"ఇవాళ ఈ వర్షానికి జడిస్తే రేపు దాని కుటుంబంలో పెనుతుఫాను రావచ్చు నోమేసూ. ఆలస్యం చేయకు. అమ్మా యికి డబ్బిచ్చి ఆముదాలవలస బస్సె క్కించు. పూరీ తిరపతి ట్రైనెక్క రేపు దయంకల్లాపెట్టిన గడువులోగా యిల్లు చేరుకుంటుంది..." అంది.

చిన్న చేతిసంచీతో పాతచీర కట్టు కుని స్వర్ణప్రతిమలా, తోటకూరకాడలా వాడిపోయిన కూతుర్ని దగ్గరకు తీసుకుని చంకలో మనవరాల్ని ముద్దాడింది. కొంగునున్న యిచ్చురూపాయి ఆ చంటి దాని చేతిలోపెట్టింది.

"వెళ్తానమ్మా! నీఆరోగ్యం జాగ్రత్త. వాడు ఉద్యోగంలో జాయినయిన వెంటనే నీకు ఉత్తరం వ్రాస్తానమ్మా..." అంది కమల.

"అలాగే తల్లీ..." అంది సీతమ్మ గారు బండి కదుల్తుంటే తృప్తిగా.

* * *

వర్షం హెచ్చయింది సీతమ్మగారి గుండెనొప్పితో స్నేహంచేసి. గదిలోకి వచ్చిందామె. గోడలు బోసిపోయి వున్నాయి. గదిలో చీకటి. ఆమె కళ్ళు చీకట్లు కమ్మాయి. ఆ చీకట్లో ఆమెకు వెలుగు కనిపించలేదు. ఆ కళ్ళలో వెలిగే ప్రాణం వెలుగుదారిని వెదుక్కుని పారి పోయింది.

